


# మాణిక్యం మళ్లీ కనిపించలేదు

నాతో పాటు యూనిట్ అంతా ఎక్కిన ఎమిరైట్స్ ఫ్లైట్ ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్టులో ఆగిన తర్వాత మా యూరప్‌టూర్ కండక్టర్ గోపీకి సంబంధించిన బస్సు వచ్చింది. లావుగా ఎత్తుగా ఉన్న బస్సు డ్రైవరు పేరు వుల్ఫీ. అంతా ఎక్కేకా కదిలిన ఆ బస్సుని వుల్ఫీ ఏమ్‌స్టర్ డేమ్ చేర్చేసరికి రాత్రయింది. ఎయిర్‌పోర్ట్ పక్కనే ఉన్న ఒక హోటల్లో దింపేరు మమ్మల్ని.

ఆ మర్నాడు ఒక స్ట్రీట్‌లో షూటింగ్ చేస్తున్నాం. సముద్రమట్టానికంటే లో లెవెల్లో ఉండే ఆదేశంలో జనం చాలా తక్కువ. రోడ్లతో పాటు వెడల్పాటి కాలవల్లో బోట్ హౌసుల్లో కాపురాలుంటున్నారు జనం. మర్నాడు పొద్దుట ఆ బోటు హౌసల బేక్‌డ్రాప్‌లో పాట షూటింగ్ మొదలెట్టాం. మాడు విండ్ మిల్స్ ముందర ఇంకొంత సాంగు తీసేక నగరంలో కొచ్చేం. సెక్సులో చాలా అడ్వాన్స్డ్ కంట్రీ అంటది. బ్లూఫిల్ములు ఎక్కువ ఆదేశంలోనే తీస్తారట. నడుస్తా వెళ్తున్న కొంతమంది అందమైన అమ్మాయిల ముందర హీరో హీరోయిన్లని నడిపిస్తా కొన్ని షాట్లు తీసేం.



రాత్రి తొమ్మిదిన్నరయినా సూర్యాస్తమయం అవ్వకపోయేసరికి అలా షూటింగ్ చేస్తానే ఉన్న మేం పదిదాటేకా హొటలు కొచ్చేం.

పగలంతా పని చేసిన ఏమ్‌స్టర్ డేమ్ స్ట్రీట్స్ గురించే ఆలోచిస్తా నిద్రపోయిన నాకు కలొచ్చింది.

ఆ కలలో ఆదేశం వీధులు కనిపించినియ్యి తర్వాత నెమ్మది నెమ్మదిగా అవన్నీ మాయమయ్యి మా పసలపూడిలో వీధులు కనిపించడం మొదలెట్టినియ్యి. మా ఇల్లు కనిపించింది. మా ఇంటి దగ్గర్నుంచి బ్రేమ్మలసుబ్బారావుగారిల్లు దాటి వస్తుంటే కుడి పక్కన బియ్యం భాగ్యంగారిల్లు దానిపక్కనే ఆడోళ్ళ రోగిబీడు కెళ్ళేదారి. దానవతల కోంటి చినెంకట్రాజుగారి డాబా దాన్ని ఆన్చి బొంబాయి (నీళ్ళు తోడే పంపుని మేమలా పిలుస్తాం) దానవతల కుమ్మరికోటయ్యగారిల్లు. మళ్ళీ వెనక్కొస్తే, యర్రమిల్లి పెద్దెంకట్రాజుగారిల్లు, కోరిశేషయ్యగారిల్లు కన్పించినియ్యి.

కోరి శేషయ్యగారింటి ఎర్రగచ్చు అరుగుమీద నిలబడ్డ మాణిక్యం గచ్చు స్తంభానికి జేరగిలబడి బావురిబిల్లికళ్ళతో చూస్తుంది. ఆవేళ తన రింగు రింగుల జుట్టుకి తలనూని (ఆమ్లా హెయిరాయిలు) రాసుకుని పక్క పాపిడి తీసి బిగించి రెండు జడ లేయించుకుంది. దోసగింజ బొట్టు పెట్టుకుంది. ఎర్రపరికిణీ చిలక పచ్చ జాకెట్టు తొడుక్కున్న మాణిక్యం నవ్వుతుంటే ఒలికిన పాలమీద వెన్నెల పడ్డట్టుంది. అలాగలాగ నవ్వుతా ఉంటుంటే సన్నగా నాజూగ్గా ఉన్న మాణిక్యం లేత శరీరం గమ్మత్తుగా ఊగిపోతుంది. ఎగ బీలుస్తా నవ్వేటప్పుడు మాణిక్యం ముక్కు బెజ్జాల్లోంచొచ్చే చప్పుళ్ళు చింతావారి గాదుల సావిళ్లలో కాపరం ఉంటున్న పావురాళ్ళు మూలుగు తున్నట్టని పిస్తున్నాయి.

మర్నాడు.

వుల్వీ బస్సులో ఏమ్‌స్టర్‌డేమ్ సిటీ దాటి చాలా మైళ్ళు వెళ్తే హేర్‌లమ్ అనే గ్రామం వచ్చింది. అక్కడ కొన్ని వందల ఎకరాల్లో రంగు రంగుల పూలు. చూడ్డానికి కళ్ళు చాలడం లేదు. "ఈ ఫ్లవర్‌బెడ్స్‌ని మనం కరక్టుగా ఎస్టాబ్లిష్ చెయ్యాలంటే హెలికాప్టరు కావాలి" అని ప్రొడ్యూసరుతో అంటే ట్రై చేద్దాం అని అక్కడ్నించెళ్ళేడాయన.

ఆ పూలపంట పండించే వాళ్ళు ఆ పూల విత్తనాల్ని (దుంపలు) తప్ప పువ్వుల్ని అమ్మరంట. పూలతోటల మధ్యలో ఒంగుని కలుపు తీస్తున్న జీన్‌పేంట్లమ్మాయిల మధ్యలో మాణిక్యం ఉన్నట్టనిపించింది నాకు.

షూటింగ్ మొదలెట్టేం.

రంగుల పూల మధ్యలో హీరో హీరోయిన్లు ఎగిరి గంతులేస్తున్నారు.

మధ్యాన్నం తర్వాత ఆ దేశం గవర్నమెంటు నడుపుతున్న ఆర్టీ కల్చరల్ గార్డెన్ దగ్గర కెళ్ళేం. గేటు దగ్గర ఒక బోర్డు మీద రకరకాల భాషల్లో రాసుంది. ప్రపంచం మొత్తం మీద ఇలాంటి గార్డెన్ ఎక్కడా లేదు అని.

లోపలికెళ్ళేం.

రకరకాల దేశాల్నించి వచ్చిన టూరిస్టులు రకరకాల భాషలు మాటాడుకుంటా ఆవనంలో కల తిరుగుతున్నారు. పసుపురంగు చీర కట్టుకుని ఒక మగతని పక్కన నడుచుకుంటా వెళ్తున్న ఒకమ్మాయిని చూసి కలగాదు నిజంగా మాణిక్యమే అనుకుంటా ఆ మనిషి దగ్గర కెళ్ళేను.

తీరా చూస్తే, ఆవిడపేరు మీనాక్షి అట. మద్రాసులో అడయార్ అట. అయ్యంగార్లు అమెరికాలో సెటిలయ్యేరట. ప్రతి ఏడూ ఈ గార్డెన్‌లో పండే డెకరేషన్ ఫ్లవర్స్‌నీ, టులిప్స్‌నీ, డెకోడిల్స్‌నీ చూసి వెళ్ళేప్పుడు ఆ విత్తనాలు పట్టుకుని వెళ్ళి పోతారంట.

రాత్రి పదిదాకా షూటింగ్ చేస్తానే ఉన్నాం. ఆ తర్వాత చీకటి పడేసరికి బాగా అలిసిపోయిన మేవంతా బస్సెక్కి ఏమ్‌స్టర్‌డేమ్‌లో

హొటలు కొచ్చి చలికి తట్టుకోలేక తాగి, తిని నిద్ర పోయేం.

కలొచ్చింది.

మళ్ళీ పసలపూడి వీధులు. అందమైన నల్లటి మాణిక్యం దర్శనం. ఆవేళ శ్రీరామనవమట తలమీంచి నీళ్ళోసుకు స్నానం చేసిన మాణిక్యం పొడుగాటి జుట్టు గాలికెగరటం లేదు. రాములోరి గుళ్ళోంచి తెచ్చుకున్న బెల్లం పాణకం కంచు గళాసులో పోసుకుని దాన్ని రెండు చేతుల్తో పట్టుకుని తాగుతా ఇందాక గుళ్ళో భజన చేసిన వాళ్ళు పాడిన "రామ రాఘవా... రక్షింపుము దేవా" అని పాడతా నిలబడుంది. మాణిక్యం గొంతులో కోయిల కాపురముందేమో పాడినా మాటాడినా చాలా సన్నగాకోయిల్లాగే ఉంది. ఉంటుంది. స్మశానాన్ని జేర్చి ఉన్న చెరువులోంచి కలవపూలు కోసుకొచ్చిన పాలేరు కుంటాదిగాడు "ఇయిగోండి పాపగారూ" అని అందిస్తుంటే నవ్వుతా మాణిక్యం అందుకుంటుంటే ఆ నవ్వు తాలూకా కాంతి ఎర్రటి కలవ మొగ్గల మీద పడి గమ్మత్తుగా మెరిసింది. ఆదిగాడేదో అంటున్నాడు. దానికి మళ్ళీ నవ్వడం మొదలెట్టింది. అలాగ మాణిక్యం నవ్వుతుంటే వెన్నెల రోజు గోదాట్లో తెరచాప పడ వెళ్తున్నట్టుంది. మంచు పడ్తున్న వెన్నెట్లో కడిపిలంక మల్లెమొగ్గ తడుస్తున్నట్టుంది. తెగిన గురుపౌర్ణమి చెంద్రుడ్ని మాణిక్యం మింగేసినట్టుంది.

అలా చూస్తానే నిలబడిపోయేన్నేను.

మర్నాడు షూటింగుతో ఆ పాటయిపోయింది. అక్కడ్నించి రాత్రికి రాత్రే వుల్వీ బస్సులో ట్రావెల్ చేసుకుంటా ఆ దేశం వదిలి ఆస్ట్రియా వచ్చేం.

ఆస్ట్రియాదేశంలో ఓబర్‌ఫెర్‌ఫ్యూస్ అనే గ్రామంలో ఉన్న ఒక హొటల్లో మా మకాం. ఆదేశంలో జనం పశువుల్ని మేపడానికి గడ్డి పెంచుతారు. ఆ ఎత్తుపల్లాల మీదా మెట్టల మీద పెరిగే ఆ గడ్డిని దూరంనించి చూస్తే చాలా గొప్పగా అనిపిస్తుంది. ఎక్కడెక్కడినించో కేరవాన్‌ల మీద వస్తున్నారు టూరిస్టులు. వాళ్ళకి కన్నపిల్లలూ కుక్కపిల్లలూ ఒకటే. కుక్కల్తో వస్తున్న ఒక గుంపులో హీరో హీరోయిన్స్‌ని కలిపేసి షాట్స్ తీస్తున్నాం. స్టూబైగ్లేషియర్ అన్న వూరెళ్ళి ఎలక్ట్రిక్ కార్లో ఎన్నో వేల మీటర్ల పైనున్న మంచుకొండల మీద ప్రయాణం చేసేక ఒక స్టేషన్లో ఆగి అక్కడ మొదలెట్టేం పాట. అక్కడ కల తిరుగుతున్న ప్రపంచంలో రకరకాల దేశాల జనం మధ్యలో మన రంగుల పట్టు జాకెట్టూ, పరికిణీ. కండువా వేసుకున్న మావూరి మాణిక్యంకూడా తిరుగుతూ కన్పించింది.

రాత్రయ్యింది.

మళ్ళీ కల.

మా పసలపూడి వీధుల్లో చిల్లోబిల్లో మంటా ఊరి జనాలు రొట్టీ బిస్కోతు అమ్మే రామారావూ. అరిటిపళ్ళ పట్టం మనవడు, మేస్త్రి వీరాసామిగారి ఇంటవతలి సందులో బుద్దాచారీ, దేవాంగుల వీధిలో నా చిన్నప్పుడు అదోలాగ చూసిన కొండమ్మ, ఇంకా రకరకాల జనం వాళ్ళమధ్యలో సన్నటిగొంతుకుతో పాడతా మాణిక్యం. బ్రహ్మయ్యగారి వీధిలో నల్లమిల్లోళ్ళెవరో లాంచీలో భద్రాచలం వెళ్ళి రాములోర్ని దర్శనం చేసుకొచ్చేరంట. వాళ్ళు తెచ్చిన విప్పపూల ప్రసాదం వీధిలో అందరికీ పంచి పెడతా మాణిక్యం గారింటిక్కూడా వచ్చేరు. నవ్వుతా ఆ ప్రసాదం తీసుకుని అందంగా తింటుంది అందంగా పాడుతుంది.

మిట్టమధ్యాన్నవయ్యింది. ఎండమండి పోతుంది. వీధుల్లో ఎవరూ లేరు. నల్లమిల్లిసూరమ్మగారయితే ఎండ వేడి తట్టుకోలేక గచ్చుమీద బిందెడు నీళ్ళు దిమ్మరించుకు మరీ పడుకుంది. కోటయ్యగారి అరుగుమీద పిల్లలు మాసినగళ్ళ దుప్పట్లు డేరాలకింద కట్టి లోపల ముచ్చి బంగారం, రంగుకాయితాలు చెమ్కీ దారాలు అట్ట కిరీటాల మీద అంటించి పొడుగాటి చింత పుల్లల్ని కత్తుల్లాగ పట్టుకుని యుద్ధాలు చేస్తున్నారు. తాడోరి మనవలూ ఆదియ్యకొడుకూ గల్సి బచ్చాలాడుకుందారని మిషను కుట్టుబూర్రావు ఇంటి పక్కనున్న పెంట మీద

దక్కను, పేసింగ్ షో సిగరెట్టు పెట్టిలు ఏరుకుంటున్నారు.

వాళ్ళింటి కిటికీ వెనకాల కూర్చునున్న కోటయ్యగారి సావిత్రి దేవాంగుల మణితో కోర్రాములుగారి విజయలక్ష్మితో హస్కులోకి దిగింది. ఈలోగా రాత్రి వాయినానికెళ్ళొచ్చిన మాణిక్యం ఆళ్ళమ్మ తెచ్చిన శనగలు ఉడకబెట్టి తాలింపు పెట్టి గిన్నెలో వేసిస్తే వాటిని తింటా అందంగా నవ్వుతుందా నల్లటి మాణిక్యం.

ఇండియా వెళ్ళిన వెంటనే మాణిక్యాన్ని చూడాలన్న ఆతృత బాగా పెరిగి పోతుంది నాలో. ఇన్స్‌బ్రూక్ సిటీ కెళ్ళాం.

ఆడా మగా తేడా లేదక్కడ. స్త్రీ పురుషుల్లో ఎవరైనా బస్సులు నడుపుతారు. ఎవరైనా బస్సులూ విమానాలూ హెయిర్‌కటింగ్ సెలూన్లూ నడుపుతారు. ఆ ఇన్స్‌బ్రూక్ చాలా చరిత్రున్న పురాతన నగరం. ఆ నగరంలో ఉన్న రెడ్‌లైట్ ఏరియాలోకెళ్ళి షూటింగ్ మొదలెట్టాం. చాలా లేతరంగు చాలీచాలని బట్టలేసుకున్న అమ్మాయిల మధ్య ముదురురంగు బట్టలేసుకున్న మాణిక్యం నడుస్తుంది దగ్గరకెళ్ళి చూస్తే మాణిక్యం కాదు. కొన్ని గంటలసేపు పాటతీసేక మరియాదెర్సే స్ట్రాస్ అనే వీధిలో కొచ్చేం. అది ఇన్స్‌బ్రూక్‌లో ఓల్డ్ సిటీలో కెళ్ళే ఒక వీధి. అక్కడ రోడ్డు పక్కనున్న ఫుడ్ లేండ్ దగ్గర షూటింగ్.

దీపాలవేళవుతుంది. చలి. ఆరాత్రి కలలో అదే వీధి. అదే కోరి శేషయ్యగారిల్లు. చల్లటేళలో సన్నటి నడుంతో, చల్లటి నవ్వుతో. మెరుపు తీగలాంటి మాణిక్యం. ఊకబంతి పువ్వుని జడపాయలో తరుముకున్న మాణిక్యం గుమ్మడిపువ్వులో కదిలే మంచుబొట్టు లాగుంది, మంచులో తెల్లార్లూ తడిసిన మల్లిపువ్వు లాగుంది.

తెల్లారింది.

చాలా సింఫనీలు, పియానో సొనాటాలూ, వయొలిన్ కాన్సెర్టులూ రాసి చిన్న వయసులో చనిపోయిన మొజార్ట్ పుట్టిన ఊరు సాల్జ్‌బర్గ్ వెళ్ళాం. ఆస్ట్రియా గురించి ఎత్తే వాళ్ళెవరైనా సరే మొజార్ట్ గురించి మాటాడతారు. ముఖ్యంగా వెస్ట్రన్ మ్యూజిక్ గురించి తెల్సున్న వాళ్ళు. అక్కడ మొజార్ట్ స్క్వేర్ చుట్టూ వున్న వీధుల్లో షూటింగ్ చేస్తున్నాం. ఆస్ట్రియా మొత్తం మీద ఎక్కువ జనాన్ని చూసింది ఆ వూళ్ళోనే ఎందుకంటే సాల్జ్‌బర్గ్ చూడ్డానికి దేశదేశాల్నుంచీ వస్తారు. రకరకాల వీధుల్లో షూటింగ్ చేసుకుంటా చివరికి ఒక వీధిలో కొచ్చేం. ఆ వీధి వెడల్పు ముఫ్పై అడుగులుకూడా ఉండదు. ఎడాపెడా ఆకాశాన్నంటే భవనాలూ, షాపులూ మ్యూజిక్ ఇనుస్ట్రుమెంట్స్ అమ్మే షాపులూ. స్వరోస్కీ క్రిస్టల్ షోరూమ్స్ అన్నీ పెద్ద పెద్దవే. రకరకాల దేశాల్నించి వచ్చిన టూరిస్టులతో కళకళ్ళాడి పోతుందా సందు. ఆ సందుకి ఎదురుగా ఎత్తైనకొండ. ఆ కొండ మీద పెద్ద కేజిల్. కిందనించి చూస్తుంటే మహాద్భుతంగా కనిపించిందది.

మా షూటింగ్ మొదలైంది.

రాత్రి కలలో మళ్ళీ మావూళ్ళో మా వీధి. మిషనుకుట్టే గంగారావు వెనక దడిలో గంగారావు పెళ్ళాం వీరవేణి స్నానం చేస్తుంటే తాటాకు సందుల్లోంచి దేవాంగుల కుర్రగాడు చేతులు కళ్ళకి రెండుపక్కలా అడ్డం పెట్టుకు మరీ చూస్తున్నాడు. వాళ్ళని చూసేసిన గంగారావు కోపంగా ''ఏం చేస్తున్నావ్‌రా లమ్డీకె'' అంటా పరుగెట్టుకొచ్చి టెంకిజెల్ల కొట్టేడు.

భూతవైద్యం చేసేవెలగలగోపాలరెడ్డిగారి సీత అరుగుమీద అన్నం తింటా మాగాయిలో ఊరిన మావిడి టెంకని చీకుతుంది.

ఇడ్లీల సుబ్బయ్యమ్మగారి అరుగుమీద కూర్చున్న పిల్లలు ఏరుకొచ్చిన కాళీ సిగరట్టు డొక్కుల్తో గంధపుగిన్ని, పందిరిమంచం, ర్యాలీసైకిలూ, వెనక్కీ ముందుకీ ఊగే బూతుబొమ్మలు చేస్తున్నారు.

అప్పుడే తలారా స్నానమాడిన మాణిక్యం లోపల కెళ్ళి బిళ్ళారి అద్దం ముందు అందంగా షోగ్గా తయారయ్యి వచ్చింది. నీలం

పరికిణీ, మిరప్పండు రంగు కండువా, ముదురు పచ్చటి జాకెట్టు తొడుక్కుంది. వాళ్ళ నాన్న పనల మీద వరికంకులు తెచ్చి ఒడ్లని దుళ్ళగొట్టి ఆళ్ళమ్మకిస్తే ఆ మనిషి అటుకులు కొట్టి ఇత్తడిగిన్నెనిండా పోసిచ్చింది మాణిక్యానికి. ఆ అటుకుల్ని నోటినిండా కుక్కుకుని తింటా చాలా తియ్యగా ఉన్నాయ్ నీక్కూడా కావాలా అనేసి సైగ చేస్తుంది.

* * *

ఎమిరైట్స్ ఫ్లైట్లో హైదరాబాద్‌లో లేండయిన రోజు రాత్రే జెట్‌లేగ్‌ని కూడా పట్టించుకోకుండా గౌతమీ ఎక్స్‌ప్రెస్ ఎక్కి మర్నాడు పొద్దుట అయిదున్నరకి రాజమండ్రిలో దిగేను. చాలా ఏళ్ళ తర్వాత వెళ్తున్నాను పసలపూడి.

కాలవ దగ్గర దిగిన నాకు చిన్నప్పుడు నేనెరిగిన ముఖం ఒక్కటీ కనిపించడం లేదు.

కోరి శేషయ్యగారి ఇల్లున్న వీధిలో కెళ్ళేను. చిన్నెంకట్రాజు పాత డాబా లేదిప్పుడు. పెరుగునుయ్యి కప్పెట్టేసేరు. ఆ రోజుల్లో సగం కట్టి ఆగిపోయి ఉన్న బసివేశ్వరుడిగుడి ఇప్పటికి పూర్తయినట్టుంది. పోతంశెట్టి అప్పారెడ్డిగారింట్లో ఇప్పుడెవరూ ఉండక పోడంతో బాగా పాడయిపోయి ఉందాఇల్లు. చెదిరిపోయున్నాయి ఇంటిమీద వాడపిల్లి పెంకులు. ఒకో ఇంటి దగ్గరా ఆగాగి నడుస్తున్న నాకు ఏభై పైబడ్డ ముగ్గురాడాళ్ళు కొత్తగా కట్టిన ఒక ఇంటి ముందు మెట్లమీద కూర్చునిఉన్నారు.

నేను పలకరించేలోపల ''ఎవరు కావాలి బాబా?'' అంటా నన్ను పలకరించేరు.

మాణిక్యం ఎక్కడండీ అని ముందే అడిగేస్తే బొత్తిగా బాగోదని ''చినెంకట్రాజు గారి అబ్బాయి నాకు బాగా తెల్సు'' అన్నాను.

''ఆళ్ళు తాపేశ్వరం మకాం ఎళ్ళి చాలా ఏళ్ళయిపోయింది గందా?'' అన్నారు వాళ్ళు.

''అలాగాండీ'' అన్న నేను ''సూరమ్మగారు ఇప్పుడెక్కడుంటున్నారు?'' అనడిగేను.

వాళ్ళలో నల్లగా పెద్దపొట్ట, ఊడిపోయిన రెండు పళ్ళు ఉబ్బిపోయి గవదలు వేలాడేముఖం ఊడిపోయిన జుట్టు వాడిపోయిన శరీరంతో ఉన్న ఆడమనిషి బొంగురు గొంతేసుకుని ''ఎవరి గురించండీ అడుగుతుంట?'' అంది.

''కోటిపిల్లి సూరమ్మగారు'' అన్నాను. ''భోగం సూరమ్మా... ఆ మణిషి ఎప్పుడో పోయింది గందా?'' అందావిడ.

''పోతంశెట్టి అప్పారెడ్డిగారు?'' అడిగేను.

''ఏనాటి మాట...ఆరు పోయి కూడా ఎన్నోఏళ్ళయ్యిపోయింది'' అందామనిషి, డోలు వాయించే కోటయ్య, కోంటి రత్తమ్మా గురించి అడిగితే పని గట్టుకుని పోయినోళ్ళ గురించే అడుగుతారేంటీ అని ఎదురడిగింది.

అప్పుడు కాస్త ధైర్యం చేసిన నేను ''మరి..మరి... కోరి శేషయ్యగారి మనవరాలు మాణిక్యం?'' అన్నాను.

దానికా మనిషి మాటాడకండా తలొంచుకుంది. పక్కనున్న మనిషి ''ఈ మనిషేనండీ మీరడిగే మాణిక్యం'' అని అంతసేపూ నాతో మాటాడిన మనిషిని చూపించింది.

అంతే, నా ముఖం మీద ఆ సాయంత్రం నీడలు చిక్కబడ్డం మొదలెట్టేనియ్యి చల్లగా వీచే పసలపూడి గాలి అకస్మాత్తుగా ఆగిపోయింది. రాత్రి బండికే హైదరాబాదు వచ్చేసిన నాకు ఆ తర్వాతెప్పుడు కల రాలేదు. ఎప్పుడన్నా వచ్చినా ఆ కలలో మాణిక్యం కనిపించలేదు.

* * *